

నిత్యాన్నదాన సత్రంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, నాయకులు

ఎన్నికల ముందు ఓట్లు మాత్రమే కావాలా?

- కార్పొరేషన్‌కు నిధులెప్పుడిస్తరు?
- కమిటీని ఎన్నడు నిర్ణయిస్తారు
- స్థానిక సంస్థల లోపు తేల్చండి
- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య డిమాండ్

వేములవాడ, అక్టోబర్ 1 : 'ఎన్నికలకు ముందు కాపుల ఓట్లు మాత్రమే కావాలి. కానీ, మమ్ముల్ని పట్టించుకునేది లేదా?' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య నిలదీశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్ చేశారని గుర్తు చేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు ₹3వేల కోట్లు ఇవ్వాలని తాను అమెరికాలో ఉండి కూడా నిరసన వ్యక్తం చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో ₹500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే ₹50 కోట్లు అక్కడికే సరిపోతాయని, అవి అపెక్స్ కమిటీకే చెందుతాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రెండెకరాల భూమి, కాపులు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన కార్యక్రమాలు, విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని గతంలోనే కోరామన్నారు. అన్నింటికీ సపోర్ట్ చేసిన మంత్రి శ్రీధర్ బాబు కూడా ప్రస్తుతం ఏమీ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఆరోజు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తన ప్రతిపాదన మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో సాధ్యమైనప్పటికీ, కమిటీ నిర్ణయించకపోగా కనీసం నిధులు కూడా ప్రకటించకపోవడం సరికాదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల లోపు కాపుల డిమాండ్‌లన్నీ పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా కాపు సంఘాల నుంచి ఇప్పటికే ఒత్తిడి వస్తుందని చెప్పారు. అంతకుముందు మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన ఖండించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొప్ప దేవయ్య, నాయకుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

వేములవాడ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- మొదటి దశలో ₹70కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణకు శ్రీకారం
- దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్
- ఆలయ అభివృద్ధిపై రివ్యూ
- హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రాజన్న ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, విప్ శ్రీనివాస్

వేములవాడ, అక్టోబర్ 1: వేములవాడ పట్టణంతోపాటు రాజన్న ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని రాష్ట్ర దేవాదాయశాఖ, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె వేములవాడలో పర్యటించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, సుందరీకరణ, మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికలు, చేపట్టే పనులు, వాటి స్థితిగతులపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వేములవాడకు 35 కిలోమీటర్ల పరిసరాలలో ఉన్న కొండగట్టు, నాంపల్లి గుట్ట, సిరిసిల్ల వేంకటేశ్వర స్వామి ఆలయం, ఇతర ఆలయాలు, కరీంనగర్ లోయర్ మ్యానేర్ డాం, ఎలగందుల ఫోర్ట్, అనంతసాగర్ వాటర్‌ఫాల్స్, రామడుగుకోట మొదలగు పర్యాటక ఆధ్యాత్మిక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం శైలజారామయ్యార్ మాట్లాడుతూ, వేములవాడ పట్టణానికి ఆధ్యాత్మిక శోభ తీసుకుని వచ్చేవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆలయం సమీపంలో అందుబాటులో ఉన్న 36ఎకరాల స్థలంలో వసతి గృహాలు, దేవస్థానం కార్యాలయం, పార్కింగ్, క్యూ కాంప్లెక్స్, సాంస్కృతిక జోన్, బతుకమ్మ పండుగ నిర్వహణకు సాంస్కృతిక వేదిక, ఇతర అభివృద్ధి పనుల కోసం ₹275కోట్లతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకంలో రాజన్న ఆలయం ఎంపికైందని, ఆ నిధులను సైతం సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వేములవాడ పట్టణంలో రహదారులు, కూడళ్ల సుందరీకరణ, విద్యుద్దీపాల ఏర్పాటు, మొదలగు అభివృద్ధి పనుల కోసం ₹80కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వేములవాడ ప్రధాన దేవాలయ అభివృద్ధి ₹70కోట్లతో చేపట్టాలని, దీనికి సంబంధించి ఆధ్యాత్మికతతో కూడిన ప్రణాళికలు ముందుగా తయారు చేయాలన్నారు.

నేత కార్మికులకు అండగా ప్రభుత్వం

నేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ పేర్కొన్నారు. వేములవాడలో నేత కార్మికుల సమస్యలు, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, పెండింగ్ బకాయిలు, ఆర్డర్లపై సంబంధిత అధికారులతో రాజన్న ఆలయ చైర్మన్ సమావేశ మందిరంలో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజారామయ్యార్ మాట్లాడుతూ, నేత కార్మికులకు బకాయిలుంటే చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలోని మహిళా సంఘాలకు 2చీరల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందని, దీని ద్వారా నేత కార్మికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. స్వతంత్రంగా ఆ చీరలు తయారు చేసే అవకాశం కల్పించాలని ఆసాములు కోరారు. ప్రైవేట్ మార్కెట్‌లో కూడా చేనేతలు రాణించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, చేనేత సమస్యలపై సీఎం సానుకూలంగా ఉన్నారని, ఇటీవలే ₹190కోట్ల బకాయిలను విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, టెస్కో జీఎం అశోక్‌రావు, ఏడీ హ్యాండ్లూమ్స్ సాగర్, నేత కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆలయ అధికారులు, అర్కిటెక్ బృందం ప్రతినిధులు సూర్యనారాయణ మూర్తి, ఆలయ పూజారులు. తదితరులు ఉన్నారు.

డీఏవో అఫ్జల్‌భేగంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

డిజిటల్ పంట సర్వే చేయలేం

కోనరావుపేట, అక్టోబర్ 1: డిజిటల్ పంట సర్వేను చేయలేమని జిల్లా ఏఈవోలు తెల్పిచెప్పారు. ఈ మేరకు నిజామాబాద్ గ్రామ రైతు వేదికలో ఏఈవోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో కీలక పాత్ర వహించడంతోపాటు ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ, రైతు పథకాలను రైతులకు చేరవేయడంలో ఏఈవోలే కీలకపాత్ర వహించమన్నారు. కానీ ప్రభుత్వం పని ఒత్తిడి పెంచి ఏఈవోలను ఇబ్బందులను గురి చేస్తున్నదన్నారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖకు సంబంధించిన 49రకాల రెగ్యూలర్ విధులను నిర్వహించడంతోపాటు డిజిటల్ సర్వే చేయడానికి తీవ్ర ఇబ్బంది ఉందని, ప్రతి గ్రామంలో గ్రామ సహాయకులను నియమించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

డీలర్ల నియామకాలపై కొనసాగుతున్న విచారణ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రేషన్ దుకాణాల డీలర్ల నియామకాలపై విచారణ కొనసాగుతున్నది. డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో ఇప్పటికే రెండుసార్లు పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ దుకాణాలు తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న 17మంది డీలర్లు హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం శుక్రవారానికి వాయిదావేసింది. డీలర్ల నియామకంలో నిర్వహించిన రాత పరీక్షలు, ఇంటర్వ్యూలకు సంబంధించి రికార్డులతో హాజరు కావాలని కోర్టు ఆర్డీవోకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. తమకు దుకాణాలు కేటాయించే వరకు ఆందోళన విరమించేది లేదని డీలర్లు స్పష్టం చేస్తున్నారు. ఈ నెల సరుకులు తమకే పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చిన అధికారులు తమ వద్ద తూకం కాంటాలు పౌరసరఫరాల శాఖకు అప్పగించాలని చెప్పడంలో అంతర్యమేమిటంటూ డీలర్లు ప్రశ్నిస్తున్నారు. కొందరు అక్రమాలకు పాల్పడ్డారంటూ కాంగ్రెస్ కార్యకర్త ఆరోపించిన విషయం చర్చనీయాంశమైంది.

నేటి నుంచి దసరా సెలవులు

తెలంగాణ చౌక్, అక్టోబర్1: బతుకమ్మ, దసరా పండగలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, వాగులు నీటితో నిండి ఉన్న నేపథ్యంలో విద్యార్థులు సెలవు రోజుల్లో వాటి వద్దకు వెళ్లకుండా ఇంటి వద్దే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాఠశాలలు తిరిగి 14న పునప్రారంభం కానున్నట్లు డీఈవో వెల్లడించారు.

లండన్‌లో 'బుద్ధి బలం' ప్రదర్శన

నాటక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

చందుర్తి, అక్టోబర్ 1: పిల్లల కోసం ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన బుద్ధి బలం నాటికను లండన్‌లోని వకీహం జిల్లా విన్నర్స్ పట్టణంలో ప్రదర్శించారు. చిన్నారులు గరిపెల్లి శ్రద్ధ, గరిపెల్లి శ్రేయ ప్రధాన పాత్రధారులుగా నాటిక ప్రదర్శించారు. లండన్‌లో పిల్లలు మన పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించడంపై పలువురు ప్రవాస భారతీయులు సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ప్రముఖులు పెద్దింటి అశోక్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

లాజిస్టిక్ సేవలు వినియోగించుకోండి

కలెక్టరేట్, అక్టోబర్ 1: బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్టీసీ లాజిస్టిక్ మేనేజర్ రామారావు పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల కొత్త బస్టాండ్‌లో లాజిస్టిక్ సేవల కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో కూడా పార్సిళ్లు చేరవేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కూడా లాజిస్టిక్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్గో లాజిస్టిక్ కౌంటర్ వివరాల కోసం సిరిసిల్ల కొత్త బస్‌స్టేషన్ 90634 03842, 94924 48189, సిరిసిల్ల పాత బస్‌స్టేషన్ 9154298576, వేములవాడ 99511 99072, ముస్తాబాద్ 99599 51781, నిమ్మపల్లి 96767 00326, కొత్తపల్లి 95810 70111, ఇతర వివరాలకు కార్గో ఎగ్జిక్యూటివ్ శేఖర్‌ను 9154298576 ని సంప్రదించాలని సూచించారు. ఇక్కడ సేల్స్ టీం లీడర్ రాజు, తదితరులు ఉన్నారు.

రాజన్న సన్నిధిలో డిప్యూటీ కమిషనర్

డిప్యూటీ కమిషనర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో శ్రీనివాస్

వేములవాడ టౌన్, అక్టోబర్ 1: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని మంగళవారం దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సర్వీసెస్ డీ కృష్ణకుమార్ దర్శించుకున్నారు. ఆలయంలో వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఏఈవో బ్రహ్మన్నగారి స్వామి వారి శేష వస్త్రం కప్పి, ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట ప్రొటోకాల్ ఏఈవో గజ్వేల్ రమేశ్‌బాబు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ ఉన్నారు.

డిజిటల్ కార్డుల వివరాలు పక్కాగా సేకరించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 1: ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని ఆయా జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, డబుల్ బెడ్రూం ఇండ్లు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై సీఎస్ శాంతికుమారితో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ నెల 3నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక మున్సిపల్, గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, దీనికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా డబుల్ బెడ్రూం ఇండ్లను త్వరలో పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, డీఆర్డీవో శేషాద్రి, మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీబేగ్, సంపత్‌రెడ్డి, డీపీఆర్వో వసంత లక్ష్మి, డీటీసీపీవో అన్సార్, తదితరులు పాల్గొన్నారు.

పాల ప్యాకెట్ కొనేందుకు వెళ్లి..

- బస్సు ఢీకొని ఒకరికి గాయాలు
- చికిత్స పొందుతూ మృతి

బోయినపల్లి, అక్టోబర్1: పాల ప్యాకెట్ కొనేందుకు కిరాణాషాపునకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా, బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావ్‌పల్లికి చెందిన రాగటి ఎల్లయ్య(56) సోమవారం సాయంత్రం పాల ప్యాకెట్ తెచ్చుకునేందుకు సమీపంలోని కిరాణాషాపునకు బయలుదేరాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సిరిసిల్ల దవాఖానకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎల్లయ్య భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వంద కొట్టు.. మేకపోతుని పట్టు..

వేములవాడ, అక్టోబర్ 1: బతుకమ్మ, దసరా వేడుకల సందర్భంగా ఈ ప్రాంత ప్రజల కోసం కొందరు బంపర్ డ్రాలను తెరమీదకి తీసుకువచ్చారు. ₹100 కొడితే ఈ నెల 10న 11డ్రా తీసి బహుమతులు అందజేస్తామని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. మొదటి బహుమతి మేకపోతు, రెండో బహుమతి రెండు కాటాన్ల బీర్లు, మూడో బహుమతి 100పేపర్స్ ఫుల్‌బాటిల్, 4వ బహుమతి రైస్‌కుక్కర్, 5వ బహుమతి రైస్‌బ్యాగ్, 6వ బహుమతి పట్టుచీర, 7వ బహుమతి సిల్వర్ కాయిన్, 8వ బహుమతి 5కేజీల చికెన్, 9వ బహుమతి రెండు నాటుకోళ్లు, 10వ బహుమతి సిగ్నిచర్ ఫుల్ బాటిల్, 11వ బహుమతి రూ.516 నగదుగా పేర్కొంటూ..సామాజిక మాధ్యమాలో పోస్ట్ చేశారు. అయితే ఈ నెల 10న వేములవాడలో మధ్యాహ్నం 12గంటలకు డ్రా తీసి విజేతలకు ఈ బహుమతులు ఇస్తామని ప్రకటించారు.

వేములవాడ ఏరియా దవాఖానకు

మూడోసారి కాయకల్ప అవార్డు

వేములవాడ, అక్టోబర్ 1: వేములవాడ ఏరియా దవాఖాన వరుసగా మూడోసారి కాయకల్ప అవార్డు దక్కించుకొని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన కాయకల్ప అవార్డును ప్రతి సంవత్సరం దక్కించుకోవడం విశేషమన్నారు. రాష్ట్రంలో దాదాపుగా వంద ఏరియా దవాఖానలు ఉండగా మూడు అంచల విధానంలో ఈ అవార్డుకు ఎంపిక చేస్తారని ఇందులో ప్రధానంగా దవాఖానలో రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, వ్యర్థాల సేకరణ, విద్యుత్ వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యత ఇలా దాదాపుగా 10 విభాగాల్లో పరిశీలించి మార్కులు ఇస్తారన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రి రాష్ట్ర బృందం జులై 26న తనిఖీ జరపగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన ఏరియా దవాఖానకు ప్రభుత్వం రూ.15 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. ఈ నగదు బహుమతి ఆస్పత్రి అభివృద్ధి వినియోగిస్తామని వారు తెలిపారు. వరుసగా అవార్డు రావడం, రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలవడం మరింత బాధ్యతను పెంచిందని సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, ఆర్ఎంఓ డాక్టర్ సంతోష్ చారి తెలిపారు.

ఎస్వీఆర్‌లో స్నాతకోత్సవం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని సాదు వెంకట్‌రెడ్డి ఐటీఐ కళాశాలలో స్నాతకోత్సవాన్ని ఘనంగా జరిపారు. మంగళవారం ఐటీఐ విద్యార్థులకు కరస్పాండెంట్ సాదు మహేందర్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడ జిల్లా ఉపాధి, శిక్షణ కన్వీనర్ కవిత, కళాశాల చైర్మన్ సాదు వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు దొమ్మాట నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటికి రా బిడ్డా ..

- పానం బాలేదు.. దవాఖానకు తోల్కపోయెటోళ్లు లేరు
- అవసాన దశలో వృద్ధురాలి ఆవేదన
- ఇల్లొదిలి వెళ్లిన కొడుకు కోసం ఎదురుచూపులు

కొడుకు కోసం ఎదురు చూస్తున్న సత్తవ్వ

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 1: నన్ని డిచి నాలుగేండ్లయింది బిడ్డా.. సాత నైతలేదు అయ్యా.. సచ్చిపోతనేమో బిడ్డా.. పానం బాగలేదు.. దవాఖానకు తోల్కపోయెటోళ్లు లేరు.. అంటూ ఓ తల్లి ఇల్లు విడిచి వెళ్లిన తన కొడుకు కోసం రోదిస్తూ ఎదురు చూస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన తాళ్ల సత్తవ్వకు ఒక్కగానొక్క కొడుకు ఐజాక్(వెంకట్ రెడ్డి) ఉన్నాడు. 20ఏండ్ల ప్రేమ వివాహం చేసుకోగా, వారికి ఒక కూతురు ఉన్నది. 15ఏండ్ల క్రితం సత్తవ్వ భర్త గాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లితోనే ఉన్న ఐజాక్ నాలుగేండ్ల క్రితం భార్య, కూతురుతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లాడు. అప్పటి నుంచి తన అడ్రస్ చెప్పకపోవడం, ఫోన్ చేయకపోవడంతో కన్నకొడుకు కోసం నిత్యం ఎదురుచూస్తున్నది. పింఛన్ డబ్బులతో కాలంవెల్లదీస్తూ.. వంట చేసుకునే శక్తిలేక ఇరుగుపొరుగు వారు పెట్టే బుక్కెడు బువ్వ కోసం వేచి చూస్తున్నది. ఇప్పటికైనా రా బిడ్డ అంటూ రోదించింది.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్: బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్, అక్టోబర్ 1: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చెట్టిపల్లి సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, పార్టీ తరపున రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును చల్మెడ అందజేసి, మాట్లాడారు. ప్రతి కార్యకర్తకు ఎప్పుడు అండగా ఉంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యాక్షుడు గొస్కుల రవి, సీనియర్ నేతలు గడ్డం హన్మాండ్లు, వెల్మ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తంపుల సుమన్, పండుగ తిరుపతి, కచ్చు పరశురాములు, జంగం చంద్రమౌళి, పండుగ రాజయ్య, నాగరాజు, శ్రీకాంత్, తిరుపతి, శంకర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి, అక్టోబర్ 1: మండల కేంద్రానికి చెందిన ఎల్లకొండ నవీన్, బింగి సత్తెమ్మ, నేవూరి చంద్రయ్య, గుగ్గిళ్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, నేతలు గంగం మహేశ్, మంచె రాజేశం, కంటె రెడ్డి, మాడిశెట్టి ఆనందం, దయ్యాల కమలాకర్, చెప్యాల గణేశ్, కర్ణవత్తుల దేవేందర్, తలారి నర్సయ్య, దుబ్బ రవి, ఉప్పులూటి గణేశ్, చంద్రయ్య, శ్యామ్, గంగారెడ్డి, నరేశ్, పెద్దులు, నర్సయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌వి డైవర్షన్ రాజకీయాలు

- ప్రజల దృష్టి మళ్లించేందుకే కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి
- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నేత రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 1: పేదలపై బుల్డోజర్లతో దాడి చేస్తున్న హైడ్రా పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని, దాన్ని కప్పి పుచ్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ గుండాలతో దాడి చేయించిందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ విమర్శించారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాల రాజ్యాన్ని నియంతృత్వ పాలన చేస్తుందని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాల గొంతులను బుల్డోజర్ల ద్వారా తొక్కి పెట్టలేరని గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అనుమతులు ఇచ్చి.. నేడు హైడ్రా పేరుతో కూల్చివేయడం ఎంత వరకు సమంజసమన్నారు. బాధిత ప్రజలకు భరోసా కల్పించేందుకు వెళ్తున్న కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి చేయడం అమానుషమన్నారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే ప్రతి దాడులు చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. హైడ్రా వ్యవహరిస్తున్న తీరుతో జనం నుంచి వస్తున్న వ్యతిరేకతను తప్పించుకునేందుకే దాడుల రాజకీయానికి కాంగ్రెస్ తెరలేపిందని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు మట్టె శ్రీనివాస్, కోడి రోహిత్, అరవింద్, సాయి, రాజు, దేవరాజు, విష్ణు, అక్రం, సమి, వెంకటేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

దాడులు సరికాదు

ముస్తాబాద్, అక్టోబర్ 1: మూసీ పరీవాహక ప్రాంతంలో బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం బుల్డోజర్లు పెట్టి ఇండ్లు కూల్చడం ఎంతవరకు సమజసమన్నారు. కేటీఆర్‌కు ఉన్న ఆదరణను ఓర్వలేకనే దాడులు చేస్తున్నారని మండిపడ్డారు.

బతుకమ్మ ఘాట్‌ల వద్ద ఏర్పాట్లు చేయాలి

గంభీరావుపేట, అక్టోబర్ 1: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రధాన కూడళ్లు, బతుకమ్మ ఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధ